క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న దృశ్యం

గాండ్లపెంట: మండల పరిధిలోని కల్లుబావి తండాకు చెందిన బుక్యా రవీంద్రనాయక్ మరణించడంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందించారు. మంగళవారం మృతుని కుమార్తె, నామినీ అయిన మీనాక్షికి రూ.10 వేల నగదును జీపీ తండా సర్పంచ్ శాంతమ్మ అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజినప్ప, సంక్షేమ కార్యదర్శి రియాజ్, కన్వీనర్ పోరెడ్డిచంద్రశేఖరరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌నాయక్, ఆంజనేయులు నాయక్‌లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సరస్వతి పూజ



విద్యాసామగ్రి అందజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు రెడ్డయ్య

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి కేఆర్ఆర్ జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులు సరస్వతి పూజను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముందుగా తరగతి గదులను ఉపాధ్యాయులు, విద్యార్థులు పచ్చతోరణాలు, పూలతో అలంకరించారు. పబ్లిక్ పరీక్షలు బాగారాసి మంచి మార్కులు సాధించాలని హెచ్‌ఎం స్నేహలత విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాలలో పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు రెడ్డయ్య పదోతరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, శివారెడ్డి, నాగేంద్రరెడ్డి, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.


గ్లాసుల వితరణ

గాండ్లపెంట: మండల పరిధిలోని మలమీదపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు ఆ గ్రామ వాసి, కదిరి పట్టణంలో నగల వ్యాపారి తాయి జ్యువెలర్స్ తరఫున తాయి ప్రతీక్‌వాస్ రూ.7వేల విలువ చేసే గ్లాసులను మంగళవారం వితరణ చేశారు. హెచ్‌ఎం లింగాల రవీంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో దాత మాట్లాడుతూ స్వగ్రామంలోని పాఠశాల అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం తాయి ప్రభాకర్, తాయి శ్రీనివాస్‌లను దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కదిరి సెక్రటరీ తాహిర్‌వలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

ఓడీ చెరువు: కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ వచ్చే నెల 5న చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మినారాయణ మాట్లాడుతూ కార్మిక వేతనాలు కనీసం రూ. 26 వేలు, కనీస పింఛను రూ. 10 వేలు, రైతులకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని, ఉపాధి కూలీలకు ప్రతి కుటుంబానికి ఏడాదికి రెండువందల రోజులు పని కల్పించాలనే డిమాండ్లతో కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమణ, శ్రీరాములు, కుళ్లాయప్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆశీర్వాదమ్మ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు రాఘవయ్య, పంచాయతీ వర్కర్లు నాగమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



రైతు భరోసా కేంద్రం వద్ద క్యాంపును ప్రారంభిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారం రోజుల పాటు గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపు నిర్వహించనున్నారు. ప్రధాన వీధులు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, పాఠశాల తదితర ప్రాంతాలలో పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. ప్రభాకర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ బి.గోపాల్‌నాయక్, అధ్యాపకులు కిరణ్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి, ఆనంద్, స్వామి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం

ఓడీ చెరువు: మండలంలోని కొండకమర్లలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారపు సంతకు సర్పంచు శ్రావణి అధ్యక్షతన మంగళవారం బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు గ్రామ కార్యదర్శి కళ్యాణి తెలిపారు. ఈఓఆర్డీ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో ఎల్లేశ్వర్ అనే వ్యక్తి రూ. 3.23 లక్షలకు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

- వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి



మెగా చెక్కును మహిళా సభ్యులకు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి



హాజరైన స్వయం సహాయక సంఘాల మహిళలు

గాండ్లపెంట: సంక్షేమ పథకాల అమలులో అధిక ప్రాధాన్యం ఇస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచారని అని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి అన్నారు. స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో డ్వాక్రా మహిళలు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా వైఎస్సార్ ఆసరా పథకం కింద మంజూరైన రూ.1.99 కోట్ల మెగా చెక్కును మహిళా సంఘాల సభ్యులకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు మూడవ విడత అక్కా, చెల్లెమ్మల ఖాతాలో వైఎస్సార్ ఆసరా నగదు జమ చేశారన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థానంలో ఉండాలన్నదే సీఎం ఆశయమన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను ఎన్నికల సమయంలో మాఫీ చేస్తానని నమ్మబలికి మహిళలకు డీ ఫాల్టర్లు(అపరాధులు)గా నిలిపిన మోసగాడు చంద్రబాబునాయుడు అని మండిపడ్డారు. అనంతరం మండలంలోని 339 సంఘాల్లోని 3,390 మంది సభ్యులకు రూ.1.99కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే సంఘ సభ్యులకు అందించారు. మహిళలు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో మహిళా సంఘాలు నిర్వీర్యం కాగా ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయంతో మహిళా సంఘాలు ఏ గ్రేడ్ సాధించాయన్నారు. మరో 30 ఏళ్ల జగనే సీఎంగా ఉండాలని దీవించారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్ర పటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు వైకేపీ ఆధ్వర్యంలో స్థానిక వీఓ కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో వైకేపీ పీడీ నరసయ్య, ఎంపీడీఓ అంజినప్ప, సర్పంచ్ రహంతుల్లా, మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ తాతం జగన్మోహన్, వైస్ ఎంపీపీ భారతి, జెడ్పీటీసీ అమరావతి, ఎంపీటీసీలు ఖమర్‌జహాన్, సోమశేఖరరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, రాష్ట్ర బీసీ డైరెక్టర్ వినీతలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు భాస్కరరెడ్డి, బీసీ కన్వీనర్ నరసింహగౌడ్, ఆర్బీకే చైర్మన్ శంకర్‌నాయుడు, ఏపీఎం సూర్యనారాయణ, సభ్యులు సంధ్యారాణి, శైలజాకుమారి, సీసీలు, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: మహిళా సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాలలో భాగంగా పుట్టపర్తి పట్టణంలో 2వ సచివాలయం పరిధిలో 3, 4 వార్డులు జండా వేపమాను, కుమ్మరపేట, శివాలయం వీధి ప్రాంతం స్వయం సహాయ సంఘాల మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మహిళలు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తుంగ ఓబుళపతి మాట్లాడుతూ ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వామ్యం చేస్తూ వారి అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీలో 482 పొదుపు సంఘాలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.3.73 కోట్లు విడుదల చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి జగనన్నకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ రమాదేవి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, వైస్ చైర్మన్ తిప్పన్న, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, సూర్యాగౌడ్, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు శివప్ప, గంగిశెట్టి, మల్లికార్జునరెడ్డి, చెన్నారెడ్డి, రామంజనేయులు, శ్రీనివాసరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటరాముడు, మెదర మధు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోండి



మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ధర్మవరం: ఈనెల 31లోపు ఇంటి, ఆస్తి పన్ను చెల్లించిన వారికి వడ్డీ మాఫీ అవుతుందని, పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. ఇంటి, ఆస్తి పన్ను బకాయి ఒకేసారి ఏక మొత్తంగా చెల్లించాలని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా గాని, నెట్ బ్యాంకింగ్ ద్వారా గానీ క్రెడిట్ కార్డులు, యూపీఐ ద్వారా పన్ను చెల్లించొచ్చన్నారు. మున్సిపల్ కార్యాలయంతోపాటు పార్థసారథినగర్ సచివాలయం -2, ఎల్‌పీ సర్కిల్ సచివాలయం, గీతానగర్ సచివాలయాల్లో ఆస్తిపన్ను, నీటి పన్నులు చెల్లించాలన్నారు. ఇప్పటి వరకు ఆస్తి పన్ను రూ.9 కోట్లా 6 లక్షలకుగాను రూ.7కోట్లా 16 లక్షలు వసూలైందన్నారు. ఇంకా రూ.కోటీ 90 లక్షలు బకాయి ఉందన్నారు. ఇప్పటి వరకు 79.03 శాతం వసూలైందన్నారు. నీటి పన్ను రూ.8 కోట్లా 60 లక్షలు ఉండగా, రూ.4 కోట్లా 86 లక్షలు వసూలైందన్నారు. రూ.3కోట్లా 74 లక్షలు బకాయి ఉందన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

గాండ్లపెంట: గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి సూచించారు. మండల వ్యాప్తంగా ఏడు గ్రామ సచివాలయాల పరిధిలో ఇల్లు లేని నిరుపేదలకు మంజూరు చేసే గృహ నిర్మాణాలపై మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తాతం జగన్మోహన్ అధ్యక్షతన ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాల వారీగా ఆయా ఇంజినీర్ అసిస్టెంట్లు, వీఆర్‌ఓలను గృహాల రిజిస్ట్రేషన్, పొజిషన్ సర్టిఫికెట్లు ఏ మేరకు సిద్ధం చేశారో అడిగి తెలుసుకున్నారు. 541 రిజిస్ట్రేషన్లు కావాల్సి ఉండగా, 328 రిజిస్ట్రేషన్ చేశామని సిబ్బంది తెలిపారు. వారంలోపు మిగిలిన రిజిస్ట్రేషన్లు చేసి లబ్ధిదారులకు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎంపీడీఓ అంజినప్ప, తహసీల్దార్ రవి, హౌసింగ్ ఏఈ చంద్రారెడ్డి, మండల కన్వీనర్ చంద్రశేఖరరెడ్డి, వీఆర్‌ఓలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

యల్లమ్మ జాతరలో ఎమ్మెల్యే

కదిరి అర్బన్: మండలంలోని ఎగువపల్లిలో మంగళవారం జరిగిన యల్లమ్మ జాతరలో ఎమ్మెల్యే డా.పీవీ సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయన వెంట సర్పంచ్ ఈశ్వరయ్య, ఖాద్రీ ఆలయ కమిటీ చైర్మన్ గోపాల క్రిష్ణ, ఎంపీటీసీ శివకుమార్, గరుడప్ప తదితరులు పాల్గొన్నారు.

రూ.5 వేలు రికవరీకి ఆదేశం



పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: మండలంలో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి చివరి వరకూ జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.5 వేలు అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీల బృందం తేల్చింది. ఆ మొత్తం రికవరీకి ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం నిర్వహించారు. డ్వామా పీడీ రామాంజనేయులు, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, ఏపీడీ రఘునాథరెడ్డి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి రాజ్‌కుమార్, ఎస్ఆర్పీ లక్ష్మీనారాయణ, ఏపీఓ మధుసూధన్‌రెడ్డి, డీఆర్పీలు పాల్గొన్నారు. ప్రతి పంచాయతీలో జరిగిన పనులు, క్షేత్ర స్థాయి పరిశీలనలో గుర్తించిన అవినీతి, లోపాలను బహిరంగ సమావేశం ద్వారా వివరించారు. పుట్టపర్తి మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా 380 పనులకు గాను రూ.9 కోట్లు పనులు జరిగాయి. మస్టర్‌లో కొట్టి వేతలు, తేదీలు మార్చడం వంటి లోపాలను గుర్తించి రూ.5 వేల జరిమానా విధించి రికవరీకి ఆదేశించారు. పీడీ రామాంజనేయులు, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఒక్క రూపాయి అవినీతి జరగకూడదని ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టినా కింది స్థాయి సిబ్బంది తప్పులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. మరోసారి ఇలాగే జరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు.

క్రీడా పరికరాల వితరణ



క్రీడా పరికరాలను అందిస్తున్న దృశ్యం

కొత్తచెరువు: విద్యార్థులకు అవసరమైన వివిధ క్రీడా పరికరాలను కిప్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సహకారంతో మహిళా చేయూత కేంద్రం కార్యదర్శి ఆర్.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అందించారు. బుక్కపట్నం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, కేశాపురం జెడ్పీ హెచ్‌ఎస్, తలమర్ల జెడ్పీ హెచ్‌ఎస్, జగరాజుపల్లి జెడ్పీ హెచ్‌ఎస్, బుక్కపట్నంలోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులకు బాల్ బ్యాడ్మింటన్ బ్యాట్లు 32, బాల్స్ 28, వాలీబాళ్లు 12, నెట్ ఒకటి, బాక్స్ టెన్నిస్ బాల్స్ 1, రెండు షటిల్ నెట్లు , సాఫ్ట్‌బాల్స్, క్యారమ్ బోర్డులు, మేకింగ్ టాప్స్, వేయింగ్ మిషన్, త్రోబాల్, హ్యాండ్ బాల్, టెన్నికాయిట్‌రింగ్స్, స్కిప్పింగ్ రోప్స్ తదితర సామగ్రిని అందజేశారు. కొత్త చెరువులోని ప్రభాత్ రూరల్ సొసైటీ కార్యాలయం జరిగిన కార్యక్రమంలో బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్ అందించారు. కార్యక్రమంలో పీఈటీలు నాగరాజు, వినయ్‌కుమార్, వెంకటేష్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మండల కమిటీ ఎంపిక



సీఐటీయూ మండల కమిటీతో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్

కనగానపల్లి: మండల సీఐటీయూ నూతన కమిటీని నియమించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. మంగళవారం నరసంపల్లి గ్రామ సమీపంలోని సత్యసాయి పంపు హౌస్ వద్ద సీపీడబ్ల్యూఎస్ కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. కార్మికుల సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా సీపీడబ్ల్యూఎస్ వేతనాలు, పీఎఫ్ పెండింగులపై కార్మికులు మాట్లాడారు. కనగానపల్లి, రామగిరి మండలాల్లోని 54 గ్రామాలకు సత్యసాయి పైపులైన్ ద్వారా మంచినీరు సరఫరా చేసేందుకు 34 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. గత 17 నెలలుగా వారికి జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ నాయకులు తెలిపారు.అనంతరం సీఐటీయూ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తగరకుంట మంజునాథ్, ఉపాధ్యక్షులుగా నరసింహులు, ముత్యాలు, మహ్మద్‌తో పాటు మరో 17 మందిని కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి

అనంతపురం: ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి పేర్కొన్నారు. డాక్టర్ ఆదిశేషారెడ్డి రాసిన ' ఉన్నత విద్యలో ముస్లిం విద్యార్థుల స్థితి ' అనే పుస్తకాన్ని వీసీ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ముస్లింలు ఉన్నత విద్యను అభ్యసించడానికి, తద్వారా జీవితంలో రాణించడానికి తోడ్పడిన అంశాలను సమగ్రంగా పుస్తకంలో వివరించారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏ మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ, ప్రొఫెసర్ మునినారాయణప్ప, డాక్టర్ ఎం. శ్రీరాములు, పుస్తక రచయిత డాక్టర్ ఆదిశేషా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్ క్యాంపులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మర్ కోచింగ్ క్యాంపులకు దరఖాస్తు చేసుకోవాలని ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 08554-353223 నంబరులో సంప్రదించాలన్నారు.

మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియల కోసం శవాన్ని తరలిస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: పట్టణంలో ఖిద్మత్ ఎ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఓ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సమర్‌నాథ్ ముఖర్జీ (71) అనారోగ్య సమస్యలతో వైద్యం కోసం పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందారు. తమ రాష్ట్రానికి తీసుకొని వెళ్లడానికి ఆర్థిక స్తోమత లేక పుట్టపర్తిలో అంత్యక్రియల నిర్వహించాలని భావించిన బంధువులు ఖిద్మత్ ఎ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆ ట్రస్టు సభ్యులే హిందూ సాంప్రదాయం ప్రకారం కర్ణాటక నాగేపల్లి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు షామీర్, మాతంగి, షాకీర్, బాబ్జాన్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

ఓడీ చెరువు: చౌకధాన్యపు డిపో డీలర్లకు ప్రభుత్వం గౌరవవేతనం ఇవ్వాలని డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎద్దుల వెంకటరంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరంధామరెడ్డి, జిల్లా కోశాధికారి చింతా నందరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఓడీ చెరువు, అమడగూరు మండల డీలర్లతో సమావేశం నిర్వహించారు. డీలర్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తీర్మానం చేశారు. సంఘటితంగా కలసి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం ఓడీసీ, అమడగూరు మండల అధ్యక్షులు మలక అశ్వర్థరెడ్డి, కొండారెడ్డి, సర్పంచు జగన్‌మోహన్‌చౌదరి డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎద్దుల వెంకటరంగారెడ్డి

తిరువణ్ణామలైకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పుట్టపర్తి టౌన్: చైత్ర పౌర్ణమిని పురస్కరించుకుని తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణామలైలో వెలసిన అరుణాచలస్వామి దర్శనార్థం భక్తులు, పర్యాటకులకు జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 5న చైత్రమాసం పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి దర్శనంతో పాటు గిరి ప్రదర్శన నిమిత్తం పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, కదిరి, డిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ఆయా డిపోల నుంచి వచ్చే నెల 5న సాయంత్రం బయలుదేరి 6న ఉదయం అరుణాచలం చేరుకుంటుందన్నారు. భక్తుల అవసరాలను బట్టి 30 మంది అడ్వాన్స్ బుకింగ్ చేసుకొంటే అదనపు చార్జీలతో ఏ గ్రామం నుంచి అయినా సరే బస్సులు నడుపుతామన్నారు. ఈఅవకాశాన్ని జిల్లాలోని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ఆయా ఆర్టీసీ డిపో మేనేజర్లను సంప్రదించాలన్నారు

నేడు వారపు సంత వేలం

నల్లచెరువు: మండల కేంద్రంలోని వారపు కూరగాయల సంతను ఉదయం 11 గంటలకు నల్లచెరువు సచివాలయం-1లో వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వసుంధర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' చెక్కు పంపిణీ

తనకల్లు: మండలంలోని కొక్కంటిక్రాస్ సమీపంలో ఉన్న పోలం సిద్దారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మండలంలోని డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి చేతుల మీదుగా మూడో విడత వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును బుధవారం పంపిణీ చేయనున్నట్లు మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరు కావాలని ఆయన కోరారు.

మసీదుకు మైక్ సెట్ వితరణ

తలుపుల: పొలతలవాండ్లపల్లి పంచాయతీలోని తురకవాండ్లపల్లి మసీదులో మైక్ సెట్ కోసం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి రూ.16,500 నగదును గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్దినాయుడుకు అందజేశారు. ఈ మొత్తాన్ని మైనార్టీ సోదరులకు మంగళవారం ఆయన అందజేశారు. రంజాన్ నెలలో నమాజుకు అనువుగా మైక్ సెట్ అందించినందుకు ఎమ్మెల్యేకి వారు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ సేవలో విద్యార్థులు



ప్రసాదం పంపిణీ చేస్తున్న విద్యార్థి

పుట్టపర్తి టౌన్: ఈశ్వరమ్మ పాఠశాల పదో తరగతి విద్యార్థులు బ్రాహ్మణపల్లి తండాలో మంగళవారం గ్రామంలో సేవలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రసాదాలు పంపిణీ చేశారు. మెదట గ్రామ దేవత మారెమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మారుతీ, హరి, సతీష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో బహిరంగ వేలం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంలో మంగళవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. ఖాద్రీ ఆలయంలో తూర్పు రాజగోపురం ఉట్టి వద్ద షాపు నెం. 2 టెంకాయలు, పూజాసామగ్రి విక్రయ హక్కు కోసం వేలం నిర్వహించగా కదిరికి చెందిన రామాంజులు రూ.10.10 లక్షలకు దక్కించుకున్నాడు. ఆలయం ముందు సీడీలు, క్యాసెట్లు విక్రయించడానికి సత్యరాజ్ జోషి రూ.4.55 లక్షలకు వేలం పాడి దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ గోపాలక్రిష్ణ, పర్యవేక్షణాధికారి నరసింహరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విదార్థులకు రైటింగ్ ప్యాడ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రమణారెడ్డి

నల్లచెరువు: మండల కేంద్రంలోని కస్తూరిబాయి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పుట్టపర్తి సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఓ శిరీష రైటింగ్ ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ రమణారెడ్డి హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు మొదట తల్లి దండ్రులను గౌరవించాలన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ అవసరమన్నారు. క్రమశిక్షణ లేని జీవితం తెగిన గాలిపటం వంటిదన్నారు. కార్యక్రమంలో గ్రామ కోఆర్డినేటర్ విశ్వనాథ్‌రెడ్డి, సత్యసాయి ట్రస్ట్ మెంబర్ గంగాధర్ గౌడ్, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సిబ్బంది శంకర్ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

ఓడీ చెరువు: మండల పరిధిలోని సుందరయ్య కాలనీలో తాగనీటి సమస్య ఏర్పడింది. సమస్యను గుర్తించిన ఎంపీడీఓ పోలప్ప,గ్రామ సర్పంచు తొట్లిరంగారెడ్డితో కలసి మంగళవారం కాలనీలోకి వెళ్లి తక్షణం మోటారుకు మరమ్మతులు చేయించారు. లోఓల్టేజీ సమస్య ఉన్నట్లు గుర్తించారు. సంబంధిత ట్రాన్స్‌కో ఏఈ రామసురారెడ్డితో ఎంపీడీఓ చర్చించి ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీని పెంచుతూ 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.